క్లుప్తంగా

అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి ఆహ్వానం

గురజాల : గురజాల ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని మండలాల్లో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ పోస్టులు భర్తీ చేయనున్నట్లు సూపర్‌వైజర్ వై.రత్నకుమారి తెలిపారు. గురజాల మండలంలోని జంగమహేశ్వరపురంలో జనరల్ కేటగిరి, దాచేపల్లిలోని ఇందిరా కాలనీలో ఎస్సీ కేటగిరి అంగన్‌వాడీ కార్యకర్త, దాచేపల్లి మండలంలోని తక్కెళ్లపాడు గ్రామంలో ఎస్సీ కేటగిరి అంగన్‌వాడీ సహాయకురాలు పోస్టులకు ఆసక్తి కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరింత సమాచారం కొరకు గురజాల ఐసీడీఎస్ కార్యాలయాన్ని సంప్రదించాలన్నారు.

విద్యార్థులకు ప్లేట్లు, పుస్తకాలు అందజేత



దాచేపల్లి : ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థుల అభివృద్ధిలో దాతలు భాగస్వాములు కావాలని ఎంఈవో పినాకపాణి అన్నారు. ఇరికేపల్లి ప్రభుత్వ పాఠశాలలో(ఎస్టీ) చదువుకుంటున్న విద్యార్థులకు వారధి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్లేట్లు, మండల సర్వేయర్ శ్రీనివాసరావు సహకారంతో పుస్తకాలు మంగళవారం అందజేశారు. ఎంఈవో పినాకపాణి మాట్లాడుతూ..ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల కోసం ప్రభుత్వం కోట్లాదిరూపాయలు ఖర్చు చేస్తుందని, అన్ని రకాల వసతులను ప్రభుత్వం కల్పించటం వలన విద్యార్థుల చదువులు సజావుగా సాగుతున్నాయన్నారు. కౌన్సిలర్ మందపాటి వీరారెడ్డి, జిల్లా మానిటరింగ్ కమిటీ సభ్యుడు గద్దల వేదమణి, సర్వేయర్ శ్రీనివాసరావు, ఫౌండేషన్ చైర్మన్ తగరం ఆనంద్‌కుమార్, ప్రధానోపాధ్యాయుడు నాగెండ్ల ఏసయ్య, స్థానికులు మాతంగి రాంబాబు, జాలె అశోక్, పప్పుల అంజి తదితరులు పాల్గొన్నారు.

సంతాన సుబ్రహ్మణ్యేశ్వరునికి విశేష పూజలు



పిడుగురాళ్ల: పట్టణంలోని నాగుల గుడి దేవస్థానంలో వేంచేసియున్న సంతాన సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి మంగళవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకొని తీర్థప్రసాదాలను స్వీకరించారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి



పిడుగురాళ్ల: రైలు ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన పట్టణంలోని ప్రజాశక్తి నగర్ రైల్వే బ్రిడ్జి డౌన్‌లో మంగళవారం జరిగింది. ఘటనకు సంబంధించి రైల్వే ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల మేరకు విశాఖపట్నం నుంచి లింగంపల్లి వెళ్తున్న జన్మభూమి ఎక్స్‌ప్రెస్ సాయంత్రం సుమారు 4.30 గంటల సమయంలో పిడుగురాళ్ల ప్రజాశక్తి నగర్ వద్ద రైల్వే బ్రిడ్జి కింద ట్రాక్ దాటుతున్న వ్యక్తిని ఢీకొంది. వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతి చెందిన వ్యక్తి వయసు సుమారు 40 సంవత్సరాలు ఉంటుందని, నీలం రంగు లుంగి, గీతలు ఉన్న తెల్లచొక్కా ధరించి ఉన్నాడు. మృతుని ఛాతిపై మరియమ్మ అని తెలుగు అక్షరాలతో పచ్చబొట్టు ఉందని తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గురజాల ప్రభుత్వ వైద్యశాలకు తరలిస్తున్నట్లు పేర్కొన్నారు. మృతుడి సంబంధీకులు ఎవరైనా ఉంటే రైల్వే ఎస్ఐ 9440438256, రైల్వే కానిస్టేబుల్ సునిల్ 94403098592 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

దేశానికే ఆదర్శంగా జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు

- సర్పంచ్ పాశం హేమలత
- ఇంటి వద్ద కూడా వైద్య సేవలు

గురజాల : జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం దేశానికే ఆదర్శంగా ఉందని గ్రామ సర్పంచ్ పాశం హేమలత అన్నారు. మండల పరిధిలోని పాత అంబాపురం గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రజారోగ్యమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమన్నారు. వైద్యానికి ప్రాధాన్యతనిస్తూ పాలన అందిస్తున్నారన్నారు. నిపుణులైన వైద్యులు రోగులకు పరీక్షలు చేయడం, ఉచితంగా మందులు అందచేయడంతో పాటు అవసరమైన వారికి మెరుగైన వైద్యం అందించడం జరుగుతుందన్నారు. ఈ వైద్య శిబిరాల ద్వారా ఎంతో మంది వైద్య సేవలు పొందారన్నారు. వైద్య రంగంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకువచ్చి ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందిస్తున్నారన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి విద్యా, వైద్య రంగాల్లో ఎన్నో విప్లవాత్మకమైన మార్పులు తీసుకువచ్చారన్నారు. అనంతరం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చసిన పౌష్టికాహార స్టాల్‌ను పరిశీలించారు. జగనన్న ఆరోగ్య సురక్ష కిట్లను ఎంపీడీవో పంపిణీ చేశారు. కార్యక్రమాన్ని ఎంపీడీవో ఆర్ ఫణికుమార్ నాయక్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు పాశం హనిమిరెడ్డి, జెడ్పీటీసీ ఆరికట్ల శ్రీనివాసరెడ్డి, పాశం పాపిరెడ్డి తదితరులున్నారు.

సురక్ష శిబిరంలో ఇంటి వద్ద కూడా వైద్య సేవలు



ఇంటి వద్దకు వెళ్లి చిన్నారికి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యుడు

దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి జగనన్న ఆరోగ్య సురక్ష ఒక వరంగా మారిందని చెప్పవచ్చు. మండల పరిధిలోని పాత అంబాపురం గ్రామంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్షలో స్త్రీ వ్యాధి నిపుణులు, చిన్నారుల వైద్య నిపుణులు సేవలు అందించారు. కాగా గ్రామానికి చెందిన దోమతోటి శ్రీ వల్లి గత కొన్ని నెలలుగా పక్కటిముకల సమస్యతో పాటు ఊపిరితిత్తుల్లో నీరు చేరి శ్వాసకోశ వ్యాధితో బాధపడుతుంది. శ్రీ వల్లి ఎప్పుడూ వెంటిలీటర్‌పై ఉంటుంది. విషయం తెలుసుకున్న వైద్య నిపుణుడు సుధీర్ శ్రీవల్లి ఇంటికి వెళ్లి వైద్య సేవలు అందించారు. జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ఇంటి వద్దనే వైద్య సేవలు అందించే విధంగా చర్యలు చేపట్టిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ప్రతి ఒక్కరూ అభినందించారు. వైద్యురాలు పద్మావతి, ఏఎన్ఎం విమలా కుమారి తదితరులున్నారు.

విజయవంతంగా జగనన్న ఆరోగ్య సురక్ష

పిడుగురాళ్ల: పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయ సమీపంలోని సీతారామపురం తండా ఎంపీపీ స్కూల్‌లో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. 3వ సచివాలయం సంజీవరెడ్డి నగర్ 1 ప్రజలకు ఈ వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో సుమారు 350 మంది వైద్యసేవలు పొందారు. వైద్య సేవలు, ఉచితంగా మందులను అందించారు. శిబిరంలో అన్ని సౌకర్యాలను మున్సిపల్ కమిషనర్ ఎ.వెంకటేశ్వర్లు ఏర్పాటు చేశారు. కౌన్సిలర్లు బడిగుంతల వెంకటేశ్వర్లు, పోలు శ్రీనివాస్‌రెడ్డి, కత్తెరపు వాసుదేవరెడ్డి, జూలకంటి శ్రీనివాసరావు, వైద్యులు మణికంఠ, అనిల్‌కుమార్, షేక్ షాహిద్‌తో పాటు ఏఎన్ఎంలు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రసన్న కుమారి, ఆరోగ్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.



వైద్య పరీక్షలను పరిశీలిస్తున్న ఎంపీడీవో తదితరులు



జగనన్న ఆరోగ్య సురక్ష విజయవంతం కావటంతో కేక్ కట్ చేస్తున్న వైద్య సిబ్బంది తదితరులు



జగనన్న ఆరోగ్య సురక్ష కిట్లను పంపిణీ చేస్తున్న ఎంపీడీవో, హనిమిరెడ్డి

ఘనంగా వల్లభాయ్ పటేల్ జయంతి

మాచర్ల రూరల్: ఉక్కు మనిషి సర్దార్ పటేల్‌ను స్ఫూర్తితో దేశ ప్రజలంతా ఐక్యంగా మెలగాలని ఎంపీపీ బూడిద శ్రీనివాసరావు కోరారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో సర్దార్ పటేల్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించి మాట్లాడారు. స్వాతంత్ర్య ఉద్యమంలో దేశ ఐక్యత కోసం 565 రాజ సంస్థానాలను దేశంలో విలీనం చేసి నవభారత నిర్మాణానికి నాంది పలికిన అపర చాణిక్యుడు సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సరోజనీదేవి, జిల్లా గొర్రె పెంపకందార్ల యూనియన్ చైర్మన్ బూడిద సైదులు, ఈఓపీఆర్‌డి కోటేశ్వరరావు, మాజీ సర్పంచ్ జింకల వెంకటేశ్వర్లు, కార్యదర్శులు బిట్టు వెంకటేశ్వర్లు, ఆవుల వెంకట్రామయ్య, సత్యనారాయణ తదితరులున్నారు.

కొప్పునూరులో...

సర్దార్ పటేల్ జయంతి సందర్భంగా జాతీయ ఐక్యత దినోత్సవాన్ని పురస్కరించుకొని పాఠశాల విద్యార్థులు కొప్పునూరు గ్రామంలో భారీ ర్యాలీ నిర్వహించారు. హెచ్ఎం ఐ.వి.నాగమణి మాట్లాడుతూ సర్దార్ స్ఫూర్తితో విద్యార్థులంతా కలిసిమెలసి ఉండి ఐకమత్యంతో దేన్నైనా సాధించవచ్చునని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రామ్మోహన్, ఆర్ ప్రసాద్, మధుబాబు, నారాయణ, సావిత్రి పాల్గొన్నారు.



వల్లభాయ్ పటేల్ చిత్రపటం వద్ద ఎంపీపీ బూడిద శ్రీను, ఎంపీడీఓ సరోజనీ దేవి



కొప్పునూరులో ర్యాలీ నిర్వహిస్తున్న హెచ్ఎం నాగమణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు

జాతీయ ఐక్యతా దినోత్సవం

మాచవరం: ప్రతి ఒక్కరు ఐక్యతాభావం కలిగి ఉండి దేశాభివృద్ధికి తోడ్పాటు అందించాలని ఎంపీడీఓ యు.బి.వరప్రసాద్ అన్నారు. మాచవరం గ్రామ సచివాలయంలో సర్దార్ పటేల్ జయంతిని పురస్కరించుకొని జాతీయ ఐక్యతా దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. పలువురు మాట్లాడుతూ దేశ ఐక్యత కోసం పటేల్ చేసిన కృషిని కొనియాడారు. ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. స్థానిక జెడ్పీ హైస్కూల్ విద్యార్థుల ర్యాలీ, అనంతరం ప్రధాన సెంటర్‌లో మానవహారం నిర్వహించారు. ఐక్యతా ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ దారం లక్ష్మిరెడ్డి, సర్పంచ్ రాగిడి నరేష్, ఎంపీటీసీ చిట్టిప్రోలు గురవయ్య, సర్పంచుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ అల్లా భక్షు, ఈఓపీఆర్‌డీ వెంగళరావు, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.



మాచవరంలో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు

పట్టణాభివృద్ధికి నిరంతర కృషి

మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు

పిడుగురాళ్ల: పట్టణంలోని అన్ని వార్డుల అభివృద్ధికి కృషి చేస్తున్నామని మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు తెలిపారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ సుబ్బారావు మాట్లాడుతూ... పట్టణంలోని అన్ని ప్రాంతాల అభివృద్ధికి నిధులు కేటాయించామని, ఇప్పటికే పలు వార్డుల్లో అభివృద్ధి పనులు చేయటం జరిగిందని, మిగిలిన వార్డులలో కూడా పనులు చేపడతామని తెలిపారు. ముందుగా మున్సిపల్ కమిషనర్ ఎ.వెంకటేశ్వర్లు అజెండాలోని అంశాలను కౌన్సిల్ హాల్‌లో చదివి వినిపించారు. 9వ వార్డు కౌన్సిలర్ మాదాల కిరణ్‌కుమార్ మాట్లాడుతూ మా వార్డులో కోతులు, కుక్కలు ఎక్కువగా ఉన్నాయని, సమస్యను పరిష్కరించాలన్నారు. అలాగే పోలీస్ స్టేషన్ సెంటర్ నుంచి రిలయన్స్ ట్రెండ్స్ వరకు రోడ్డు విస్తరణ చేసినప్పటికీ వాహనాల పార్కింగ్ అస్తవ్యస్తంగా చేయటం వలన ఇబ్బందిగా ఉందని, పలు ప్రమాదాలు కూడా జరుగుతున్నాయని కౌన్సిల్ దృష్టికి తీసుకొనివచ్చారు. స్పందించిన కమిషనర్ కోతులు పట్టుకునే వారిని త్వరలోనే పిలిపించి టెండర్లు ఆహ్వానిస్తామని తెలిపారు. ట్రాఫిక్ సమస్యను సంబంధిత పోలీస్ అధికారులకు తెలిపి రోడ్డుపై వాహనాలు నిలిపకుండా చర్యలు తీసుకుంటామన్నారు. 2వ వార్డు కౌన్సిలర్ కొక్కెర శ్రీనివాసరావు మాట్లాడుతూ.. రోడ్డు విస్తరణ పనులు అర్థంతరంగా నిలిచిపోయాయని మిగిలిన పనులు పూర్తి చేయాలని, అలాగే ఫైబర్ నెట్, ఇంటర్‌నెట్‌కు సంబంధించిన కేబుల్స్ విద్యుత్ స్తంభాలకు ఏర్పాటు చేస్తున్నారని, ఇటువంటి వారిపై చర్యలు తీసుకోవటమో, పన్నులు వసూలు చేయటమో చేపట్టాలని సభ దృష్టికి తీసుకొనివచ్చారు. 31వ వార్డు కౌన్సిలర్ షేక్ సైదావలి మాట్లాడుతూ.. పాటిగుంటల్లో డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేక ఇబ్బందికరంగా ఉందని, అలాగే వాటర్ స్కీమ్ ద్వారా వచ్చే నీళ్ల దుర్వాసన వస్తున్నాయని సభ దృష్టికి తీసుకొనివచ్చారు. దీనికి కమిషనర్ మాట్లాడుతూ.. రోడ్డు విస్తరణ పనులు త్వరలోనే పూర్తి చేస్తామని, ఫైబర్ నెట్ వారికి చెప్పి సంబంధిత చర్యలు తీసుకుంటామని, డ్రైనేజీ సమస్యను పరిష్కరిస్తామని, వాటర్ స్కీమ్‌కు సంబంధించి వాటర్ శుద్ధి చేయటంతోపాటు సరఫరాలో ఎక్కడా లోపాలు జరగకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. పలువురు కౌన్సిలర్లు వారి స్థానిక వార్డులోని సమస్యలను మున్సిపల్ చైర్మన్ దృష్టికి తీసుకువచ్చారు. వాటిని త్వరలోనే పరిష్కరిస్తామని వార్డు కౌన్సిలర్లుకు హామీ ఇచ్చారు. మున్సిపల్ వైస్ చైర్మన్లు కొమ్ము ముక్కంటి, షేక్ జైలాబ్దిన్, మున్సిపల్ కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు, కమిషనర్ ఎ. వెంకటేశ్వర్లు

వడ్డెర్లపై తప్పుడు ప్రచారం మానుకోవాలి

దాచేపల్లి : అభయ ఆంజనేయస్వామి దేవాలయం స్థలంపై తప్పుడు ప్రచారం మానుకోవాలని కమిటీ సభ్యులు, వడ్డెర సంఘం నేతలు అన్నారు. నడికుడి రైల్వేస్టేషన్ రోడ్డులోని వడ్డెర కాలనీలో అభయ ఆంజనేయస్వామి దేవాలయం స్థలంపై తప్పుడు ప్రచారం చేస్తున్న గరిణే వెంకటేశ్వరరావు వ్యాఖ్యలను కమిటీ సభ్యులు మంగళవారం ఖండించారు. కమిటీ అధ్యక్షుడు పల్లపు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. గత 50 సంవత్సరాల క్రితమే అభయ ఆంజనేయస్వామి దేవాలయం నిర్మాణం కోసం స్థలం కేటాయించామని, 30 ఏళ్లుగా అక్కడ ఎన్నో పూజలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఇటీవల ఈ స్థలంలో దేవాలయం నిర్మాణానికి స్థానిక ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన జరిగిందని, గుంటూరులో నివాసం ఉంటున్న గరిణే వెంకటేశ్వరరావు వడ్డెర్లను అవమానపరుస్తూ స్థలం తనదంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారని తెలిపారు. ఈ స్థలం దేవాలయానికి చెందినదిగా వెంకటేశ్వరరావుని స్వయంగా కలిసి చెప్పిన పట్టించుకోకుండా ఇబ్బందులు పెడుతున్నారని, దీనిపై కోర్టును ఆశ్రయిస్తే దేవాలయం కమిటీ సభ్యులకు అనుకూలంగా తీర్పు వచ్చిందని వివరించారు. దేవాలయ స్థలం, వడ్డెర్లపై తప్పుడు ప్రచారం చేస్తున్న ఆయనపై పరువు నష్టం కేసు వేస్తామని, స్థలం కబ్జా చేసేందుకు ఎన్ని అడ్డంకులు సృష్టించిన అధిగమించి దేవాలయ నిర్మాణం చేపడతామని చెప్పారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు బత్తుల బయ్యన్న, బత్తుల శ్రీను, వేముల ఏడుకొండలు, ఓర్సు వెంకటేశ్, ఉప్పు ఏడుకొండలు, ఓర్సు శివ, చల్లా హరికృష్ణ, బత్తుల నాగేశ్వరరావు, లక్ష్మీనారాయణ, కోటేశ్వరరావు, హరిబాబు, కొండ, వెంకన్న తదితరులున్నారు.



కోర్టు ఉత్తర్వులను చూపిస్తున్న కమిటీ సభ్యులు, వడ్డెర సంఘం నేతలు

నాటకరంగంలో చరితార్థుడు గుర్రం చెన్నారెడ్డి



రెంటచింతల: పల్నాడు కవిగా అభ్యుదయవాది, రంగస్థల నటుడిగా పేరు పొందిన గుర్రం చెన్నారెడ్డి 27వ వర్ధంతిని గురువారం ఆయన స్వగ్రామంలో నిర్వహించనున్నారు. 1955 లో స్వాతంత్ర్య సమరయోధులు కర్పూరపు నాసరయ్య, తిరునగరి రామాంజనేయులుతో కలిసి ప్రజా చైతన్య కార్యక్రమంలో హైదరాబాద్, గుంటూరు పట్టణాలలో గొల్లసుద్దులు, తప్పెట దరువులు అను ప్రదర్శనల్లో పాల్గొని చెరగని ముద్ర వేసిన చెన్నారెడ్డి, నాలుగు దశాబ్దాలపాటు రంగస్థలంపై నరసింగరాజు, మాయలపకీర్, ధర్మంభిక్షం, విజయసింహుడు, రఘుపతి, చాణక్యుడు, కై లాస్‌బరబ్బాస్‌లో బరబ్బాస్ వంటి అనేక పాత్రలకు జీవం పోశారు. 1962లో బందరులో పల్నాటియుద్ధం నాటకంలో నరసింగరాజు పాత్ర పోషించిన గుర్రం చెన్నారెడ్డిని కవి పాదుషా పువ్వాడ శేషగిరిరావు ఘనంగా సన్మానించి రజతపాత్ర కళాసుధాకర బిరుదును ప్రదానం చేశారు. నూతక్కిలో జరిగిన రాష్ట్రస్థాయి ఏకపాత్ర పోటీలలో చెన్నారెడ్డికి వెండి నటరాజు విగ్రహం బహుకరించారు. 1975లో అప్పటి విద్యాశాఖ డైరెక్టర్ రామచంద్రరావు నుంచి ఘన సన్మానం పొందారు. 1981లో ఆనాటి విద్యామంత్రి కె.కేశవరావు నుంచి స్వర్ణపతాక సత్కారం పొందిన చరిత్ర చెన్నారెడ్డిది. 1987 మార్చి 30న హైదరాబాద్ రవీంద్రభారతిలో ఉగాది పర్వదినాన అప్పటి ముఖ్యమంత్రి ఎన్‌టీఆర్ చేతులమీదుగా చెన్నారెడ్డిని ఘనంగా సన్మానించిన ఘటన ఇప్పటికీ ఆయన మిత్రులు చర్చించుకుంటారు. సినీ సీనియర్ నటులు జె.వి.సోమయాజులుతో కలిసి చెన్నారెడ్డి జాతికి ఊపిరి స్వాతంత్ర్యం అనే రూపకంలో నటించి జీవించారు. 1995లో ఓ ప్రముఖ సంస్థ కళామూర్తి అనే బిరుదుతో సత్కరించింది. నవోదయం, అరణ్యవాసి, మబ్బుతెర, జీవితం, రక్తాభిషేకం, తిరుపతమ్మ కథ, చేజారిన స్వర్గం, కలికొకమాట, మగ్గాలమరియ వంటి 12 నాటకాలు రచించారు. ఆయన రాసిన పల్నాటి చరిత్ర పరిశోధన గ్రంథాన్ని మానవవనరుల శాఖ తీసుకోవడం జరిగింది. చలిచీమ, ఆఖరాట, కష్టార్జితం, దాసుడి తిప్పలు రేడియోలో ప్రసారం కావడం జరిగింది. రెండు తెలుగు రాష్ట్రాలలో ఎన్నో ప్రశంసలతో పాటు అనేక రజత, బంగారు పతకాలను పొందిన గుర్రం చెన్నారెడ్డి మరణం తెలుగు కళారంగానికి తీరని లోటని జాతీయ కళాకారుల సంఘం అధ్యక్షులు జెట్టిపాలెం వెంకటేష్, పలువురు కళాకారులు అన్నారు. చెన్నారెడ్డి 1996 నవంబర్ 2న రెంటచింతలలో మరణించారు.

పేద ప్రజల నాయకుడు సీఎం జగన్

ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి



మాచర్ల: రాష్ట్రంలో సంక్షేమం ద్వారా పేద వర్గాలకు లక్షల కోట్ల రూపాయలు అందించి కరోనా కాలం నుంచి ఇప్పటి వరకు అన్ని వర్గాల మనిషిగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇప్పటికీ పేదల కోసం తపిస్తూ, కష్టపడుతూ ముందుకెళ్తున్న సీఎం జగన్‌కు అందరూ మద్దతు పలకాలని పల్నాడు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి కోరారు. మంగళవారం మాచర్ల ఆయన క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. పట్టణ కేంద్రంలోని నెహ్రూనగర్ ప్రాంతంలోని వీవీఎస్ గార్డెన్స్‌లో బుధవారం జరగనున్న నియోజకవర్గ స్థాయిలో విస్తృత సమావేశం జయప్రదం చేయాలని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆంధ్రప్రదేశ్‌కు సీఎం జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం నవంబర్ 1న నిర్వహించనున్నట్లు తెలిపారు. పట్టణం, ఐదు మండలాలు, క్షేత్ర స్థాయి నుంచి మండల అధ్యక్షులు, పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులుతో పాటు పలువురు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు తరలి రావాలన్నారు. సీఎం జగన్ రాష్ట్రంలో విద్యా, వైద్యం, పారిశ్రామిక అభివృద్ధి, లక్షలాది కుటుంబాలకు పారదర్శకంగా నేరుగా వారి ఖాతాలకు నగదు జమ ఇంటింటికీ రేషన్, రోడ్ల నిర్మాణం, ఎత్తిపోతల పథకాలు, బోర్లు ఏర్పాటు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు భూములు అందజేత తదితర కార్యక్రమాల ద్వారా ముందుకెళ్తున్నారు. ఒంటరి పోరాటం చేసి పొత్తులతో సంబంధం లేకుండా ప్రజల కోసం నిరంతరం కృషి చేస్తూ, ప్రజలకెప్పుడూ అందుబాటులో ఉంటూ పేద వర్గాలకు అండగా నిలుస్తూ, పెత్తందార్లపై యుద్ధం చేస్తున్న సీఎం జగన్‌కు ఏపీ ప్రజలంతా అండగా ఉండి మరొక్కసారి సీఎంగా చేసేందుకు కృషి చేయాలని పీఆర్కే పిలుపునిచ్చారు. అందులో భాగంగానే కార్యకర్తలు, అన్ని వర్గాల నాయకులను చైతన్య పర్చేందుకు మళ్ళీ సీఎం జగన్ ఎందుకు కావాలనే కార్యక్రమంలో భాగంగా ఈ సమావేశం నిర్వహించటం జరుగుతుందన్నారు. ఈ సమావేశాన్ని జయప్రదం చేయాలని ఆయన విలేకరుల సమావేశంలో కోరారు. మూడు జిల్లాల వైఎస్సార్‌సీపీ కో ఆర్డినేటర్ పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి, వివిధ మండలాల ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

కౌన్సిల్‌లో అన్ని అంశాలకు ఆమోదం



మున్సిపల్ చైర్మన్ చిన ఏసోబు

మాచర్ల: పట్టణంలోని ప్రతి సమస్యను ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఆయన సూచనల మేరకు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుందామని మున్సిపల్ చైర్మన్ మాచర్ల చిన ఏసోబు అన్నారు. మంగళవారం పట్టణంలోని పురపాలక సంఘ కార్యాలయంలో కౌన్సిల్ సాధారణ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. పట్టణంలోని వివిధ వార్డులలో మంచినీటి బోర్లు, అవసరమైన సామాను కొనుగోలు చేసేందుకు రూ.2 లక్షలు, మోటారు రిపేర్స్ కింద మంజూరు చేసిన రూ.30 లక్షల అత్యవసర పనుల నిమిత్తం నిధులు కేటాయించిన విషయంపై తీర్మానం చేశారు. అదే విధంగా పట్టణంలోని కేసీపీ అతిథి గృహం వరకు చెక్కల బ్రిడ్జితో గత 30 సంవత్సరాలుగా ఇబ్బంది దృష్ట్యా సీసీరోడ్డు ఏర్పాటుకు పీఆర్కే ఆదేశాల మేరకు రూ.40 లక్షలు కేటాయించి నిర్మాణ పనులు చేయనున్నట్లు తీర్మానం చేశారు. నాగార్జున సాగర్ డ్యాం నుంచి దేవలపల్లి విభాగం వరకు ఎన్‌హెచ్ 565 రోడ్డు విస్తరణలో భాగంగా 22 వార్డులలో ప్రజలకు నీరందక ఇబ్బంది పడుతున్నారు. ప్రభుత్వ విప్ పిఆర్కే ఆదేశాల మేరకు రూ.30 లక్షలు నిధులు కేటాయించి అనుమతికి కౌన్సిల్ నిర్ణయం తీసుకుంది. మొత్తం 17 అంశాలను ఆమోదించారు. కోట్ల రూపాయలను వివిధ గ్రాంట్ల కింద మంజూరు చేసి మున్సిపల్ అభివృద్ధికి జనవరి నెలాఖరులోపు చర్యలు తీసుకునేందుకు ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ వైస్ చైర్మన్ పోలూరి నరసింహారావు, 1వ వార్డు కౌన్సిలర్ గట్ల అరుణ, 29వ వార్డు కౌన్సిలర్ షేక్ సుభాని, 15వ వార్డు కౌన్సిలర్ పోలా శ్రీనులు కోతులు, కుక్కలు, లో ఓల్టేజీ, మంచినీటి సమస్యతో పాటు వివిధ అంశాలను కౌన్సిల్ దృష్టికి తీసుకొచ్చారు. అన్ని అంశాలపై చర్యలు తీసుకుంటామని మున్సిపల్ చైర్మన్ మాచర్ల చిన ఏసోబు, కమిషనర్ ఈవీ రమణబాబు అన్నారు. కమిషనర్ రమణబాబు మాట్లాడుతూ పల్నాడు జిల్లాలో 27 జగనన్న కాలనీల్లో ఆర్చీలు మంజూరు కాగా రూ.1కోటి 80 లక్షలతో 19 కాలనీ ద్వారాలు నిర్మించేందుకు నిధులు మంజూరైనట్లు తెలిపారు. మంచినీటి సమస్య, ట్యాంకర్ల నిర్వహణ, వివిధ అంశాలపై ప్రణాళిక సిద్ధం చేసినట్లు తెలిపారు. కౌన్సిలర్ రామిశెట్టి వెంకటేశ్వర్లు ట్యాంకర్ల నిర్వాహకులకు బిల్లులు చెల్లిస్తామని చెప్పారు. ఈ సమావేశంలో డీఈ మధుసూదనరావు, ఏఈ శామ్యూల్, ఆర్ఐ వెంగయ్య, కౌన్సిలర్లు ఎంఆర్ఎఫ్ రామాంజనేయరెడ్డి, చవ్వా అనిత, శంకర్, మదార్‌సాహెబ్, మందా సంతోష్, చంద్రంతో పాటు పలువురు కో ఆప్షన్ మెంబర్లు అనంతరావమ్మ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న కౌన్సిలర్లు

అంగన్‌వాడీ కేంద్రాలలో ఆకస్మిక తనిఖీ

రెంటచింతల: సమాజహితం కోసం అంగన్‌వాడీల సేవలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ దాసరి చౌడేశ్వరి అన్నారు. మంగళవారం మండలంలోని జెట్టిపాలెం గ్రామంలో మూడు అంగన్‌వాడీ కేంద్రాలను ఆమె ఆకస్మికంగా సందర్శించి రికార్డులను తనిఖీ చేసి మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాలలో 0–6 ఏళ్ల చిన్నారులకు, బాలింతలకు, గర్భిణులకు మెరుగైన సేవలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సేవలను విస్తృతపరిచినట్లు తెలిపారు. పిల్లలకు ప్రీ స్కూల్ విద్యను అందించడంతో పాటు పోషకాహార లోపం, అనారోగ్యం, తగ్గిన లెర్నింగ్ సామర్థ్యం, శిశుమరణాలు వంటి వాటిని నివారించేందుకు అంగన్‌వాడీ కేంద్రాలు పనిచేస్తాయన్నారు. పిల్లలకు వినూత్న పద్ధతుల ద్వారా విద్యను అందిస్తున్న ఒక సంరక్షణ, ఒక ఆట స్థలంగా అంగన్‌వాడీ కేంద్రం పనిచేస్తుందన్నారు. గ్రామాలలో బాలింతలు, గర్భిణులు, చిన్నారుల తల్లులు అంగన్‌వాడీ సెంటర్ల ద్వారా అందుతున్న పోషకాహారంతో పరిపూర్ణమైన ఆరోగ్యం పొందాలని ఆకాంక్షించారు. అంగన్‌వాడీలు సమయపాలన పాటించి ఈ కేంద్రాల ద్వారా ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందించాలన్నారు.



జెట్టిపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీపీ దాసరి చౌడేశ్వరి

శరవేగంగా దాచేపల్లి అభివృద్ధి

దాచేపల్లి : వైఎస్సార్ సీపీ ప్రభుత్వం హయాంలో ఏర్పడిన దాచేపల్లి నగరపంచాయతీ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని చైర్మన్ కొప్పుల సుబ్బమ్మ అన్నారు. నడికుడి సచివాలయంలో కౌన్సిల్ సమావేశం మంగళవారం జరిగింది. నగర పంచాయతీ పరిధిలో 827 మంది నిరుపేదలకు ఇంటి స్థలాలు ఇచ్చేందుకు కౌన్సిల్‌లో తీర్మానం చేశారు. 12,13 వార్డుల్లో రూ.15 లక్షలతో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు ఆమోదం తెలిపారు. ఈ సందర్భంగా నగర పంచాయతీ చైర్మన్ సుబ్బమ్మ మాట్లాడుతూ...నగర పంచాయతీ ఏర్పడిన తరువాత కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టామని, ప్రధానంగా తాగునీరు ప్రజలకు అందించేందుకు చర్యలు తీసుకున్నామని చెప్పారు. సిమెంట్ రోడ్లు, డ్రైనేజీ పనులు ముమ్మరంగా చేపట్టామని, దాచేపల్లి కొట్లాబజార్‌లో రూ.2.50 కోట్లతో సిమెంట్ రోడ్లు నిర్మించామని, నడికుడి రైల్వేస్టేషన్ రోడ్డు ఆధునీకరణ పనులు చేస్తున్నామని వివరించారు. మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రభుత్వం నుంచి నిధులు తీసుకువస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో కమిషనర్ వి.సత్యనారాయణ, వైస్ చైర్మన్లు షేక్ మస్తాన్‌బీ, కొమెరబత్తిన అన్నపూర్ణ, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.



నగర పంచాయతీ సమావేశం జరుగుతున్న దృశ్యం

3న వాహనాలకు వేలం

నకరికల్లు: నాటుసారా, మద్యం కేసుల్లో సీజ్ చేయబడిన వాహనాలకు నవంబర్ 3న వే లం నిర్వహించనున్నట్లు ఎస్ఐ ఏ బాలకృష్ణ మంగళవారం తెలిపారు. వాహనాల స్థితి పోలీసుస్టేషన్ ఆవరణలో ముందుగా పరిశీలించుకోవచ్చని అన్నారు. ఆసక్తి గల వారు వేలం అధికారి వద్ద ముందుగా రూ.2 వేలు డిపాజిట్ చేయాలన్నారు. వివరాలకు స్థానిక పోలీసు స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.